క్లుప్తంగా

నేడు పిన్నాపురంలో గ్రామసభ

పాణ్యం : మండల పరిధిలోని పిన్నాపురం గ్రామంలో గురువారం గ్రామసభ నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి బుధవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం ఈ సభను నిర్వహిస్తున్నామన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే గురువారం నుంచి ఈనెల 30వ తేదీ వరకు ఆయా రేషన్ షాప్‌ల పరిధిలోని మంచంపై ఉన్న వారు, 65ఏళ్లు పైబడిన వారి ఇళ్ల వద్దకు రేషన్ పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. అలాగే కొత్త రేషన్ కార్డుల దరఖాస్తుకు, మార్పు చేర్పులకు అవకాశం ఉందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పాఠశాలల ఆకస్మిక తనిఖీ



మాట్లాడుతున్న మానిటరీ అధికారి మాధవి

పాణ్యం : మండల కేంద్రమైన పాణ్యంలోని ఎంపీపీ పాఠశాల, ఆశ్రమ పాఠశాల, పాణ్యంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ప్రభుత్వ పాఠశాలల అకాడమీ మానిటరింగ్ అధికారిణి మాధవి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలల్లో రాధాకృష్ణ విద్యా మిత్ర కిట్లను పరిశీలించారు. అలాగే మధ్యాహ్నం విద్యార్థులకు అందించే భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

టార్పాలిన్ దొంగల పట్టివేత

పాణ్యం : మండల పరిధిలోని తమ్మరాజుపల్లె గ్రామంలో బుధవారం తెల్లవారుజామున ఓ లారీపై ఉన్న టార్పాలిన్ పట్టలను దొంగిలిస్తున్న దొంగలను లారీ యాజమాని పట్టుకొని పోలీసులుకు అప్పగించారు. రాత్రి సమయంలో లారీపై ఉన్న టార్పాలిన్ పట్టలను ఎత్తుకెళ్లేందుకు ఇద్దరు దొంగలు వచ్చినట్లు సమాచారం. దొంగలు బనగానపల్లె మండలానికి చెందిన వారుగా గుర్తించారు.

వృద్ధుల ఇళ్ల వద్దకే బియ్యం అందించాలి



మాట్లాడుతున్న సీఎస్ డీటీ శివరామ్

ఓర్వకల్లు : 65 ఏళ్ల వయస్సుగల వయోవృద్ధులకు ఇళ్ల వద్దకే వెళ్లి బియ్యం పంపిణీ చేయాలని తహసీల్దార్ విద్యాసాగర్ ఆదేశించారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండల స్థాయి డీలర్ల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. జూలై నెలకు సంబంధించిన రేషన్ బియ్యాన్ని 65 ఏళ్లు పైబడిన వృద్ధులకు ఈ నెల 26 నుంచి 30 తేదీలోగా ఇళ్ల వద్దకు వెళ్లి అందించాలన్నారు. మండలంలో నడువలేని వారు, వయస్సు మీద పడినవారు దాదాపు 2 వేల మంది వున్నట్లు గుర్తించినట్లు తెలిపారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ సతీష్, సీఎస్ డీటీ శివరామ్ పాల్గొన్నారు.

వృద్ధులకు రేషన్ పంపిణీ



సి.బెళగల్లో రేషన్ డీలర్లతో మాట్లాడుతున్న తహసీల్దార్ వెంకటలక్ష్మి

సి.బెళగల్: మండల పరిధిలోని వృద్ధులకు, దివ్యాంగులకు నేటి నుంచి ఈనెల 30వ తేది వరకు రేషన్ సరుకులు అందజేయాలని తహసీల్దార్ వెంకటలక్ష్మి డీలర్లను ఆదేశించారు. బుధవారం ఆమె సివిల్‌సప్లై డిప్యూటీ తహసీల్దార్ (సీఎస్‌డీటీ)తో కలసి మండలంలోని రేషన్ డీలర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఉన్న 41 రేషన్ షాప్‌లలో 1,541 మంది వృద్ధులు, దివ్యాంగులు ఉన్నారన్నారు. వీరికి ఇళ్ల దగ్గర రేషన్ సరుకులు ఇవ్వాలన్నారు. మిగిలిన లబ్ధిదారులకు ఒకటో తేది నుంచి రేషన్ పంపిణీ చేపట్టాలన్నారు. సమీక్షలో ఆర్ఐ తరుణ్ ఉన్నారు.

ఇళ్ల పట్టాల పేరుతో మోసం

కర్నూలు(అర్బన్): నగరంలోని మాధవీనగర్‌కు చెందిన కొందరు నాయకులు ఒక గ్రూపుగా ఏర్పడి ఇళ్ల పట్టాలు మంజూరు చేస్తున్నట్లు చెబుతూ బ్రాహ్మణులను మోసం చేస్తున్నారని నగర బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు సండేల్ చంద్రశేఖర్ ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం స్థానిక సంకల్‌బాగ్ వేంకటేశ్వర స్వామి ఆలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల వెనుక ప్లాట్లు వేసి పాణ్యం ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ఇళ్ల పట్టాలను ఇస్తున్నట్లు ప్రచారం చేస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలోనే నకిలీ నాయకులు నగరంలోని పేద బ్రాహ్మణుల నుంచి రూ.15 వేలు చొప్పున వసూలు చేసి నకిలీ పట్టాలు పంపిణీ చేశారన్నారు. జరిగిన మోసాలపై తగిన ఆధారాలతో జిల్లా పోలీస్ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. సంఘం నాయకులు చెరువు వెంకట దుర్గా ప్రసాద్, కంచుగంటల శ్యాంసుందర్ రావు, నాగవరం రాజశేఖర్ పాల్గొన్నారు.

ఆషాఢం.. విశిష్టం

- ప్రారంభమైన ఆషాఢ మాసం
- పండుగలకు ప్రత్యేకం
- కొత్త జంటలకు నెల రోజుల ఎడబాటు



కర్నూలు కల్చరల్: ఆషాఢ మాసం ఎంతో విశిష్టం .. ఏకాదశి, గురుపౌర్ణమి, చాతుర్మాస వ్రతాలు, పూరీలో జగన్నాథుని రథయాత్ర.. ఇలా ఎన్నో పండుగలు మరెన్నో ప్రత్యేకతలు దీని సొంతం. అయితే నవ దంపతులకు మాత్రం భారం.. కోటి ఆశలతో ఒక్కటైన జంటకు నెల రోజులపాటు ఎడబాటు తప్పదు. వారు మాత్రం శ్రావణం రావాలి అంటూ నిరీక్షిస్తుంటారు.

ఆషాఢ మాసం గురువారం ప్రారంభం కానుంది. ఈ మాసాన్ని శూన్యమాసం అంటారు. వివాహం లాంటి శుభకార్యాలు తలపెట్టరు. ఈ మాసంలో అనేక పర్వదినాలు ఉన్నాయి. ఆషాఢ శుద్ధ ఏకాదశి వైష్ణవ ఆరాధకులకు ముఖ్యమైంది. దీన్నే తొలి ఏకాదశి అంటారు. అప్పటినుంచి ప్రతి వారం ఏదో ఒక పండుగ, వ్రతం, పూజ ఉంటాయి. తొలి ఏకాదశి నుంచి చాతుర్మాస వ్రతాన్ని ప్రారంభిస్తారు. వారాహి నవరాత్రి పూజలు ఆషాఢ మాసం తొలి రోజు నుంచే ప్రారంభమవుతాయి.

➤ గోరింటాకు ప్రత్యేకం: ఆషాఢ మాసంలో యువతులు గోరింటాకు తప్పక పెట్టుకోవాలని పెద్దలు చెబుతుంటారు. గోరింటాకుకు మన సంప్రదాయంలో ప్రత్యేక స్థానం ఉంది.

➤ ఆషాఢ పౌర్ణమిని మనం వేద వ్యాసుని పేరిట గురుపౌర్ణమిగా నిర్వహించుకుంటాం.

➤ తెలంగాణలో బోనాల పండుగ నిర్వహిస్తారు. వర్షాల కారణంగా కూరగాయలు బాగా పండుతాయి. దుర్గామాతను శాకంబరీగా అలంకరించి తొమ్మిది రోజులపాటు పూజలు నిర్వహిస్తారు.

➤ ఒరిస్సాలోని పూరిలో జగన్నాథుని రథయాత్ర కూడా ఈ మాసంలోనే అత్యంత వైభవంగా నిర్వహిస్తారు.

వధూవరుల విరహం

ఆషాఢ మాసంలో అత్తా కోడళ్లు ఒక ఇంటిలో ఉండకూడదంటారు. కొత్తగా పెళ్లయిన దంపతులను దూరంగా ఉంచుతారు. ఇందులో భాగంగా అమ్మాయిని పుట్టింటికి తీసుకెళతారు. ఇందులో శాస్త్రీయత ఉందని పెద్దలు పేర్కొంటారు. ఈ మాసంలో స్త్రీ నెల తప్పితే తొమ్మిది నెలల తర్వాత వేసవి కాలంలో ప్రసవించే అవకాశం ఉందని అప్పుడు ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉండి శిశువుకు ఆ వాతావరణం ఇబ్బంది కలిగిస్తుందని, ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందని తల్లీబిడ్డల ఆరోగ్యానికి కూడా ఈ వాతావరణం మంచిది కాదంటారు. అందుకే ఈ మాసంలో నూతన దంపతులను దూరంగా ఉంచుతారు.

పెద్ద పండుగల రాకకు శుభసూచకం



ఆషాఢాన్ని శూన్య మాసంగా భావిస్తారు. శుభ కార్యాలు చేయకూడదని విశ్వసిస్తారు. నిజానికి పెద్ద పండుగల రాకను ఈ మాసం తెలుపుతుంది. వైష్ణవులు ఈ మాసాన్ని ఎంతో పవిత్రమైందిగా భావిస్తారు. మఠాధిపతులు ఈ మాసంలోనే చాతుర్మాస దీక్ష వహిస్తారు.

– అగ్రహారం రాఘవేంద్ర, పండితులు

సూపర్‌సిక్స్ పథకాల అమలులో ప్రభుత్వం విఫలం



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు క్రిష్ణ

కోడుమూరు రూరల్: సూపర్‌సిక్స్ పథకాల అమలులో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు క్రిష్ణ విమర్శించారు. బుధవారం కోడుమూరులో సీపీఐ మహాసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను దారుణంగా మోసం చేశారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చి ఏడాది పూర్తయినా ఇప్పటి వరకు పథకాలను అమలు చేయలేదన్నారు. రాష్ట్రంలో రైతుల పరిస్థితి దారుణంగా ఉందని, గత ఏడాది పంటలు నష్టపోయిన వారికి ప్రభుత్వం ఇప్పటి వరకు పరిహారం అందించలేదన్నారు. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నెల గడుస్తున్నా పెట్టుబడి సాయం అందించలేదన్నారు. ఎన్నికల ముందు అన్నదాత సుఖీభవ పథకాన్ని గొప్పగా ప్రకటించి ఆచరణలో పెట్టలేదన్నారు. సీపీఐ మండల కార్యదర్శి రాజు మాట్లాడుతూ గూడు లేని పేదలకు వెంటనే స్థలాలు మంజూరు చేసి గృహ నిర్మాణాలు చేపట్టాలన్నారు. సమావేశంలో ఏఐటీయూసీ మండల కార్యదర్శులు రాముడు, స్థానిక నాయకులు సువర్ణమ్మ, అక్బర్, చాంద్‌బాషా, అరుణ్, ఉరుకుందు, ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

విధులను నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవు



కోడుమూరులో సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ నాసర్‌రెడ్డి

కోడుమూరు రూరల్: గ్రామ సచివాలయ సిబ్బంది విధులను నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని జెడ్పీ సీఈఓ నాసర్‌రెడ్డి హెచ్చరించారు. బుధవారం మండలంలోని ప్యాలకుర్తి, కోడుమూరు, పులకుర్తి గ్రామాల్లో ఎంపీడీఓ రాముడుతో కలిసి ఆయన పర్యటించారు. ఆయా గ్రామాల్లో ఇంటింటి నుంచి చెత్త సేకరణ, గ్రామాల పరిశుభ్రత, గ్రామ సచివాలయ సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. అలాగే చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను పరిశీలించారు. కోడుమూరులోని మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో సీఈఓ గ్రామ సచివాలయ సిబ్బందితో మాట్లాడుతూ పట్టణంలోని ప్రతి ఇంటి నుంచి చెత్తను సేకరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పట్టణంలో ప్రతి 250 ఇళ్లకు ఒక క్లాప్‌మిత్రను ఏర్పాటు చేయాలని ఈఓ అజయ్‌భాస్కర్‌ను ఆదేశించారు. అలాగే ప్రభుత్వ ఇచ్చిన సర్వేలను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

నిరుపయోగం



శిథిలావస్థలో పూడురు బస్ షెల్టరు

కర్నూలు(రూరల్): ప్రయాణికుల సౌకర్యార్థం లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించిన బస్‌షెల్టర్లు నిర్వహణ లేక నిరుపయోగంగా మారాయి. మండల పరిధిలో పూడురు గ్రామంలోని బస్ షెల్టరు ఏకంగా శిథిలావస్థకు చేరుకుంది. ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి. దీంతో ప్రయాణికులు అందులోకి వెళ్లేందుకు భయపడుతున్నారు. అధికారులు స్పందించి ఈ బస్ షెల్టరును బాగు చేయాలని కోరుతున్నారు.

నేరేడు పండు.. ఔషధ గుణాలు మెండు

- దీర్ఘకాలిక వ్యాధుల వారికి ఎంతో ఉపయోగం
- ఆరోగ్యానికి మేలు
- మార్కెట్లో కిలో ధర రూ.100 నుంచి రూ.150



తోపుడు బండిపై అమ్ముతున్న నేరేడు పండ్లు

గడివేముల: నోరూరించే నేరేడు పండ్లు మార్కెట్లోకి వచ్చేశాయి. ఈ పండ్లను ఇష్టపడని వారంటూ ఎవరూ ఉండరు. సీజన్ ఫలాలు కావడంతో జూన్, జూలై నెలల్లో మాత్రమే ఈ పండ్లు లభిస్తాయి. ఆరోగ్య ప్రదాయినీగా పిలిచే నేరేడు పండును సక్రమంగా వినియోగిస్తే ఆరోగ్యానికి సంపూర్ణంగా మేలు చేయడంతో పాటు శరీరంలో ఏర్పడే అనేక అనారోగ్య సమస్యలను, రుగ్మతలను దూరం చేస్తుందని వైద్యులు చెబుతున్నారు. మండలంలో అధికంగా గని, మంచాలకట్ట, దుర్వేశి, గడివేములలో తోటల్లో నేరేడు చెట్లు సాగుచేశారు. స్థానికంగానే కాకుండా ఎక్కువగా ఈ పండ్లను ఉభయ గోదావరి జిల్లాలతో పాటు మహారాష్ట్ర, మదనపల్లి తదితర ప్రాంతాల నుంచి వ్యాపారులు దిగుమతి చేసుకుంటున్నారు. వ్యాపారులు తోపుడు బండ్లపై గ్రామీణ ప్రాంతాల్లోకి సైతం తీసుకొచ్చి విక్రయిస్తున్నారు. కిలో రూ.100 నుంచి రూ.150 ధర పలుకుతుంది. .

నేరేడు పండ్లతో ప్రయోజనాలు..

➡ నేరేడు పండ్లలో ఐరన్, కాల్షియం, పొటాషియంతో పాటు ఏ, సీ విటమిన్లు పుష్కలంగా ఉంటాయి. వీటి వల్ల వ్యాధి నిరోధక శక్తి పెరిగి సీజనల్ వ్యాధుల బారి నుంచి రక్షణ కలుగుతుంది.

➡ మూత్ర సమస్యలు నియంత్రణతో పాటు మధుమేహం అదుపులో ఉంటుంది. కిడ్నీలను శుభ్రపరుస్తుంది. మూత్రాశయంలో ఇన్ఫెక్షన్లు తగ్గుతాయి. కాలేయం పనితీరును మెరుగుపర్చడంతో పాటు శుభ్రపరుస్తుంది.

➡ నేరేడు పండ్లలో యాంటీ ఆక్సిడెంట్లు గుండెకు, మెదడుకు దివ్యౌషధంగా పనిచేస్తాయి.

➡ దంతాలు, చిగుళ్లు ఆరోగ్యకరంగా ఉంటాయి. చిగుళ్ల నుంచి రక్తస్రావం తగ్గుతుంది. నోట్లో చెడు బ్యాక్టీరియా నశించి దుర్వాసన రాకుండా చేస్తుంది.

➡ కడుపులో పేరుకుపోయిన మలినాలు బయటకు పోవడానికి నేరేడు పండు దోహదపడుతుంది.

➡ నేరేడుపండులో విటమిన్లు, ఖనిజ లవణాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరంలో సంభవించే అనేక రుగ్మతలను నివారిస్తాయి.

తినడంలో నియంత్రణ లేకుంటే...

➡ నేరేడుపండ్లు తినడంలో నియంత్రణ లేకుంటే దుష్ఫలితాలు ఉంటాయి.

➡ వగరు రుచి కలిగిన నాణ్యత లేని నేరేడుపండ్లు భుజిస్తే గొంతు నొప్పి సంభవించవచ్చు. సీజన్ మారే సమయంతో ఈ పండ్లను మితంగా తినాలి.

➡ ఉబ్బసం ఉన్నవారు ఈ పండ్లను ఎక్కువగా తినరాదు. దీర్ఘకాలిక శ్వాస సంబంధిత సమస్యలు వచ్చే ఆస్కారం ఉంది.

➡ నేరేడుపండ్లలో ఉండే అత్యధిక లవణాలు, పోషకాల వల్ల బలహీనమైన జీర్ణవ్యవస్థ కలిగిన వారికి తరచూ కడుపునొప్పి సంభవించే అవకాశం ఉంది.

నేరేడు పండ్లలో మంచి పోషకాలు



నేరెడు పండ్లలో పోషకాలు సమృద్ధిగా ఉంటాయి. నీరు, ప్రొటీన్లు, కొవ్వులు, కార్బోహైడ్రేట్‌లు, విటమిన్‌లు, మినరల్స్ ఉంటాయి. వీటిని తగు మోతాదులో తీసుకోవాలి. షుగర్ వ్యాధి నియంత్రణకు ఎంతగానో దోహదపడుతాయి. వేసవి కాలంలో వచ్చే సమస్యలకు మంచి పరిష్కారం ఉంటుంది. ప్రజలు సీజనల్‌గా వచ్చే పండ్లను మితంగా తీసుకోవాలి.

– కిరణ్‌కుమార్, వైద్యాధికారి, గడివేముల

హామీల అమల్లో కూటమి ప్రభుత్వం విఫలం

కర్నూలు(సెంట్రల్): ముస్లిం మైనార్టీలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభు త్వం విఫలమైందని ఆవాజ్ కమిటీ జిల్లా కార్యదర్శి ఎస్ఏ సుభాన్, ఉపాధ్యక్షుడు పి.ఇక్బాల్‌హుస్సేన్, జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ఎండీ షరీఫ్ విమర్శించారు. బుధవారం ఆవాజ్ కమిటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఏడాదిలో ఏమి సాధించిందని సంబరాలు చేసుకుంటున్నారని ప్రశ్నించారు. మసీదుల్లో పనిచేసే మౌజమ్‌లకు రూ.10 వేలు, ఇమామ్‌లకు రూ.5 వేలు ఇస్తామన్న హామీని ఎప్పుడు అమలు చేస్తారన్నారు. మైనార్టీ యువతీ, యువకులకు స్వయం ఉపాధి కోసం ఇస్తామన్న రుణాలు ఇవ్వలేదని చెప్పారు. ముస్లిం మహిళల వివాహాలకు ఇచ్చే ప్రోత్సాహకాలను ఎందుకు విడుదల చేయడం లేదని ప్రశ్నించారు. ముస్లింలకు ఇచ్చిన ఒక్క హామీని కూడా అమలు చేయని కూటమికి పాలించే అర్హత లేదన్నారు.

పత్తి సాగులో శాస్త్రీయ పద్ధతులు పాటించాలి



రైతులకు సూచనలిస్తున్న ఏఓ మధుమతి

ఓర్వకల్లు : పత్తి పంటలో శాస్త్రీయ పద్ధతులను పాటించి, వర్షాభావ పరిస్థితుల నుంచి కాపాడుకోవాలని వ్యవసాయాధికారిణి మధుమతి అన్నారు. బుధవారం మండలంలోని బైరాపురం, లొద్దిపల్లె గ్రామాలలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. రైతులు సాగు చేసిన పత్తి, కంది, మొక్కజొన్న పంటలను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ.. ఈ ఏడాది ఖరీఫ్ ఆరంభంలో కురిసిన వర్షాలకు సాగు చేసిన పంటలు ప్రస్తుతం బాగానే వున్నాయని తెలిపారు. వర్షాభావ పరిస్థితులు ఉన్నపుడు పంటలకు 19:19:19/పొటాషియం నైట్రేట్/10 గ్రాముల యూరియాను లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓ భాస్కర్, వీఏఏలు, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.



రైతులకు భూసార పరీక్షల పత్రాలను అందజేస్తున్న ఏఓ దస్తగిరి రెడ్డి



గుండ్రేవులలో రైతులకు భూసార పరీక్షల పత్రాలు అందజేస్తున్న ఏఓ మల్లేష్‌కుమార్

పంటల పోషణకు సూక్ష్మపోషకాలు అవసరం

సి.బెళగల్: పంటల పోషణకు సూక్ష్మ పోషకాలు అవసరమని మండల వ్యవసాయ అధికారి (ఏఓ) మల్లేష్‌కుమార్ అన్నారు. బుధవారం ఆయన మండల పరిధిలోని ఇనగండ్ల, గుండ్రేవుల గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఆయా గ్రామాల రైతులు భూసార పరీక్ష ఫలితాల పత్రాలను అందజేశారు.

రసాయన ఎరువుల వాడకం తగ్గించాలి...

కోడుమూరు రూరల్: రైతులు కంది, పత్తి పంటల సాగులో రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించాలని మండల వ్యవసాయాధికారి రవిప్రకాష్ సూచించారు. బుధవారం మండలంలోని గోరంట్ల గ్రామంలో ఏఓ రవిప్రకాష్ రైతులతో కలిసి పత్తి, కంది పంటల సాగుపై 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ పత్తి సాగు చేసిన రైతులు ప్రతి రోజు పంటను పరిశీలిస్తూ ఉండాలని, రసం పీల్చే పురుగు, దోమలు కనిపిస్తే వేపనూనెను స్ప్రే చేసుకోవాలన్నారు. పచ్చ, తెల్ల దోమ నివారణకు జిగురు అట్టలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రాల సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

గూడూరులో..

గూడూరు మండలం కె.నాగలాపురం గ్రామంలో ఏఓ దస్తగిరి రెడ్డి బుధవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించి పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. అలాగే భూసార పరీక్షలు చేయించుకున్న రైతులకు భూసార ఫలితాల పత్రాలు అందజేశారు. అనంతరం ఏఓ మాట్లాడుతూ పంట సాగుకు ముందు రైతులు భూసార పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

పంచాయతీ నిధుల అవకతవకలపై విచారణ



రికార్డులను పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ లక్ష్మి

ఓర్వకల్లు : మండల కేంద్రం ఓర్వకల్లు గ్రామ పంచాయతీలో వసూలైన పన్నులకు సంబంధించిన నిధుల్లో అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు రావడంతో ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించారు. ఈ మేరకు బుధవారం డీఎల్‌పీఓ లక్ష్మి విచారణ చేపట్టారు. గ్రామంలో దాదాపు 850 గృహాలు వుండగా, అందులో 150 ఇళ్లు కొత్తగా నిర్మించినట్లు గుర్తించారు. ఇందులో కేవలం 38 ఇళ్లకు మాత్రమే అప్రూవల్ ఇవ్వగా, మిగతా వాటికి ఏవిధమైన అప్రూవల్స్ ఇవ్వలేదని, గతంలో ఈఓఆర్‌డీగా వున్న పీవీ సుబ్బారాయుడు అవినీతికి పాల్పడినట్లు తెలిసింది. దీనిపై విచారణ చేపట్టాలని 2022లో గ్రామానికి చెందిన ఎం. రాంభూపాల్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. అదేవిధంగా గ్రామంలోని సర్వే నంబర్ 124/9 లో వున్న ప్రభుత్వ భూమిలో(పొరంబోకు స్థలం) కోర్టులో విచారణ జరుగుతుండగా ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శిగా పని చేసిన సుబ్బారాయుడు అక్రమంగా అనుమతులు ఇవ్వడమేగాక, కొళాయి కనెక్షన్ ఇచ్చినట్లు ఆరోపించారు. అంతేకాకుండా ఇంటి పన్ను, కుళాయిల డిపాజిట్ రశీదు పుస్తకాలు గల్లంతైనట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయాలపై డీఎల్‌పీఓ లక్ష్మి విచారణ చేపట్టారు.

డప్పు కళాకారుల పింఛన్ పెంచాలి



కొంతలపాడులో జెండాను ఎగురవేస్తున్న రాష్ట్ర అధ్యక్షులు ఆనంద్‌బాబు

ఓర్వకల్లు : రాష్ట్ర వ్యాప్తంగా డప్పు కళాకారులకు ప్రస్తుతమిస్తున్న రూ.3 వేల పింఛన్‌ను రూ.7 వేలకు పెంచాలని ఏపీ డప్పు కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ ఆనంద్‌బాబు డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని ఎన్ కొంతలపాడు గ్రామంలో ఏపీడీకేఎస్ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ముందుగా స్థానిక ప్రాథమిక పాఠశాల నుంచి వంద మంది డప్పుల దరువులతో గ్రామంలో ప్రదర్శన చేపట్టారు. ఎస్సీ కాలనీ వద్ద కేవీపీఎస్, ఏపీడికేఎస్ పతాకాలను ఎగుర వేశారు. ఆనంద్‌బాబు మాట్లాడుతూ.. గ్రామాలల్లో ప్రతి శుభ, అశుభ కార్యక్రమాలకు, ఊరేగింపులను డప్పు కళాకారులు లేనిదే నిర్వహించరని గుర్తు చేశారు. వీరి అవసరాలను దృష్టిలో పెట్టుకొని చర్మకారులు, డప్పు కళాకారుల పెన్షన్ ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని కోరారు. ఏపీడికెఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మద్దిలేటి, కరుణాకర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి నాగన్న, కేవీపీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి పెద్ద బాబు తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ డ్రైవింగ్‌పై చర్యలు తీసుకోవాలి

కర్నూలు (టౌన్): డ్రైవింగ్ సమయంలో బ్లూటూత్, ఇయర్ ఫోన్లు వాడుతూ ప్రమాదాలకు కారణమవుతున్న ద్విచక్ర వాహనదారులపై ట్రాఫిక్ పోలీసులు కేసులు నమోదు చేయాలని జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు, మాజీ కార్పొరేటర్ జి.సురేందర్ విన్నవించారు. ఈ మేరకు బుధవారం జిల్లా ఎస్పీ విక్రాంత్‌పాటిల్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ కర్నూలు నగరంలో రోజూ పదికి పైగా రోడ్డు ప్రమాదాలు సెల్‌ఫోన్ డ్రైవింగ్ వల్లే జరుగుతున్నాయన్నారు. ప్రత్యేకంగా సిబ్బందిని నియమించి ముఖ్య కూడళ్లలో తనిఖీలు చేసి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

గడివేముల: మండల పరిధిలోని గని గ్రామానికి చెందిన ఓ యువతి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగార్జున రెడ్డి బుధవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన ఓ యువతి ఇంట్లో ఎవరు లేని సమయంలో అదృశ్యమైంది. ఇంటిపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ కనిపించక పోవడంతో తల్లి శ్రీదేవి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

పాణ్యం : మండల కేంద్రమైన పాణ్యంలోని జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలైనట్లు హైవే పోలీసులు తెలిపారు. నంద్యాల నుంచి కర్నూలుకు బయలుదేరిన తుఫాన్ వాహనం పాణ్యం వద్ద బర్రెను తప్పించబోయి ముందు వెళ్తున్న ట్యాంకర్‌ను ఢీకొంది. ఈ ఘటనలో డ్రైవర్‌తో పాటు మరో వ్యక్తికి గాయాలయ్యాయి. అలాగే విజయనికేతన్ పాఠశాల వద్ద కర్నూలు నుంచి ఆళ్లగడ్డకు వెళ్తున్న బైక్, పాఠశాల నుంచి హైవే ఎక్కుతున్న బైక్‌ను ఢీకొనడంతో పాణ్యం గ్రామానికి చెందిన నారాయణమ్మ అనే మహిళకు గాయాలైనట్లు తెలిపారు. చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

సారా కేసులో మహిళ అరెస్టు

కర్నూలు: కర్నూలు బంగారుపేట శివారులోని కేసీ కెనాల్ గట్టున ఉన్న నాటుసారా స్థావరంపై ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించి బట్టీలను ధ్వంసం చేశారు. సారా విక్రయిస్తున్న బంగారుపేటకు చెందిన నీలిషికారి లక్ష్మిని అరెస్టు చేసి ఆమె వద్ద 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. ఆమెపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. సారా తయారీకి ఉపయోగించే సుమారు వెయ్యి లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. దాడుల్లో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ రాజశేఖర్ గౌడ్, కర్నూలు సీఐ చంద్రహాస్, సుభాషిణి, ఎస్ఐ నవీన్, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డుపైనే మురుగు



ఉలిందకొండలో రోడ్డు మధ్యలో నిలిచిన మురుగు నీరు

కల్లూరు: మండల పరిధిలోని ఉలిందకొండ గ్రామంలో రైల్వే స్టేషన్‌కు వెళ్లే దారిలో రోడ్డు మధ్యలో మురుగు నీరు నిలిచింది. ఈ దారిపై గ్రామస్తులతో పాటు రైల్వే స్టేషన్ వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అలాగే గ్రామంలో బీసీ కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో కాలనీ వాసులు అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి మురుగు కాలువలు నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వ్యవసాయ పనుల్లో రైతన్నలు బిజీ



పత్తి విత్తనాలు నాటుతున్న వ్యవసాయ కూలీలు

కల్లూరు: ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో రైతులు వివిధ పంటలు సాగు చేసే పనుల్లో బిజీగా ఉన్నారు. గతేడాది కంటే ఈ ఏడాది మండల వ్యాప్తంగా పత్తి సాగు విస్తీర్ణం పెరుగుతుందని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు. నీటి వసతి ఉన్న రెమడూరు, పుసులూరు, బొల్లవరం, సల్కాపురం, పెద్దపాడు, బస్తిపాడు మొదలగు గ్రామాలకు చెందిన రైతులు పత్తి పంటను ముందస్తుగా ఇప్పటికే విత్తుకున్నారు. వరుణుడు సకాలంలో కురిస్తే పత్తి దిగుబడి ఆశాజనకంగా రావచ్చుని మెట్ట పొలాల రైతులు సాగు చేస్తున్నారు.